లాయరు వెంకటేశం చెప్పింది వినగానే సుందరమ్మ నిస్పృహతో మాటరాక కుర్చీలో వెనుకకు వాలిపోయింది.

ఆవిడ కళ్ళు వర్షించడానికి సిద్ధంగా వున్నాయి. అతి ప్రయత్నంమీద దుఃఖాన్ని నిగ్రహించుకోవడానికి ప్రయత్నిస్తూంది.

"ఏం చేస్తాం సుందరమ్మగారూ..జడ్జిగారు తీర్పు అలా ఇచ్చారు. నేనెంత కష్టపడి వాదించానో చూశారు కదా. నా ప్రయత్న లోపం లేదు. అయినా కంగారు పడకండి. హైకోర్టుకు అపీల్ చేద్దాం."

వెంకటేశం ఓదార్పు మాటలు సుందరమ్మ చెవుల్లో ప్రవేశించడంలేదు. ఆఖరి మాటలు మాత్రం ఉలిక్కిపడింది.

# నల్లకోటు తెల్లకోటు

## —పి. వెంకటేశ్వర్లు

"హైకోర్టా! ఎంతవుతుంది లాయరుగారూ" అంది హీనస్వరంతో. అప్పటికే సుందరమ్మ నవనాడులు కృంగిపోయాయి.

"మూడు, నాలుగు వేల్లో అయిపోతుందిలెండి. మొదటి నుంచి ఈ కేసు నేను చూస్తున్నాను కాబట్టి ఇంకా తక్కువే చెప్పాను. మీరు మరో లాయరు దగ్గర కెళ్తే ఐదువేలు పైమాటే అనుకోండి" అన్నాడు జడ్జిమెంట్ కాపీ తిరగేస్తూ.

సుందరమ్మకు అగాధంలోకి కూలిపోతున్నట్టనిపించింది. మళ్ళీ అంత డబ్బు తెచ్చే స్థితిలో లేదు.

సుందరమ్మ భర్త రామానుజం పదిహేనేళ్ళ క్రితమే ఏక్సిడెంట్‌లో చనిపోయాడు. పోయేసరికి సుందరమ్మకు మిగిలిన ఆస్తి ఒక చిన్న ఇల్లు, భర్త ఆఫీసులో ఇచ్చిన ప్రావిడెంట్ ఫండ్, ఇన్సూరెన్స్ తాలూకూ ఇరవై వేల రొక్కము, ఏడాది నిండిన కొడుకు గోపాలం.

రామానుజం పోయాక బంధువర్గం వాళ్ళంతా వచ్చి ఆ ఇరవై వేలు ఎలాగోలా స్వాహా చెయ్యాలని ప్రయత్నించారు. అందరితో చిష్మారానికి కూడా సిద్ధపడి సుందరమ్మ ఆ డబ్బుని బ్యాంకిలో వేసి వడ్డీతో కొడుకును పెంచి గుట్టుగా సంసారం గడుపుకుని వచ్చింది.

వేన్నీళ్ళకు చన్నీళ్ళు తోడుంటాయన్న ఆశతో తన ఇంటిలో పెద్ద భాగాన్ని 50 రూపాయిలకు అద్దెకు ఇచ్చి వేసి, చిన్న గది వంటింట్లో తామిద్దరూ వుంటూ ఎలాగో కాలాన్ని నెట్టుకొస్తున్నారు.

ఆ అద్దెకు ఇచ్చింది 'సెక్రటేరియెట్'లో పనిచేస్తున్న రామారావనే గుమస్తాకి. రామారావు మొదట కొన్నేళ్ళు అద్దె రెగ్యులర్‌గా ఇచ్చివేశాడు. రానురాను మగ దక్షత లేని కుటుంబం తనేం చేయలేదనే ధీమాతో అప్పుడప్పుడు ఇవ్వడం మానేసేవాడు.

అద్దె పెంచకపోవడమే కాకుండా ఆ అద్దె కూడా సరిగ్గా ఇవ్వకపోయేసరికి సుందరమ్మకు కోపం వచ్చి ఖాళీ చేయమని చెప్పింది.

ఇక ఆరోజు నుంచి అద్దె ప్రసక్తి లేకుండా రామారావు హాయిగా ఆ ఇంటిని అనుభవిస్తున్నాడు.

సుందరమ్మకు నెమ్మదిగా బ్యాంకిలో డబ్బు తరిగిపోసాగింది. ఇరవై నుంచి పదివేలకు దిగిపోయింది.

ఇక చేసేదిలేక సుందరమ్మ రామారావుపై దావా వేసింది. కోర్టు వ్యవహారం తొందరగా తేలడం, వచ్చిన మనిషి బ్రతికిరావడం ఒకటే ఈ రోజుల్లో.

క్రింది కోర్టులో సుందరమ్మ గెలిస్తే, డిస్ట్రిక్ట్ కోర్టులో తన పలుకుబడి అంతా ఉపయోగించి రామారావు నెగ్గుకొచ్చాడు.

కోర్టు ఖర్చులకైతేనేం, ఇల్లు గడవడానికైతేనేం పదిలో మరో అయిదువేలు కరిగిపోయాయి.

ఇప్పుడు హైకోర్టుకు అపీల్ చేయాలి. హైకోర్టు వున్న వూరు హైద్రాబాదే అవడంవల్ల కొంత సదుపాయమైనా, సుందరమ్మకు అది తలకు మించిన భారమే!

మిగతా అయిదు వేలు ఖర్చయిపోతే ఇక సుందరమ్మకు జరుగుబాటు అవదు. అయినా హైకోర్టులోనైనా గెలుస్తుందని నమ్మకం ఏదీ.

"నేను కొంచెం ఆలోచించుకోవాలండీ లాయరుగారూ" అంది సుందరమ్మ కుర్చీలో నుంచి లేస్తూ.

"తప్పకుండాను. కాని నెల రోజుల లోపునే ఏ సంగతీ నాకు చెప్పాలి. కాని కేసును సగంలో వదిలెయ్యకండి. ఇంత ఖర్చు పెట్టాక ఇల్లు రామారావు పరం చేసేస్తారా. తప్పకుండా ఈసారి మనమే గెలుస్తాం. ఏ బంగారమో అమ్మి అయినా మీరు డబ్బు తీసుకు రండి" అంటూ భరోసా ఇచ్చాడు.

వెంకటేశం మాటలు సుందరమ్మ హృదయాన్ని తూట్లు తూట్లు పొడుస్తున్నాయి. "బంగారం అమ్మాలి. లేకపోతే మరో గత్యంతరం లేదు" ఇదే ఆలోచనలతో సుందరమ్మ ఇంటి ముఖం పట్టింది.

చేతికున్న రెండు జతల బంగారు గాజులు మాసుకుంది. ఎంత లేదన్నా అయిదువేలు వస్తాయి.

భర్త తనకు ఎంతో ప్రేమగా చేయించాడు. భర్త స్మృతులు సుందరమ్మ హృదయాన్ని కలచివేశాయి.

కాని, కాని, గాజులు అమ్మక తప్పదు. ఆ ఇల్లయినా గోపాలానికి మిగల్చకపోతే ముందుముందు ఎలా బ్రతుకుతాడు. ఇంకా పై చదువులకు డబ్బు కావాలి.




ఇంటర్ పూర్తయి డిగ్రీ చదవాలి. కేసు గెలిచి రామా రావు ఖాళీచేస్తే కనీసం 300 అయినా అద్దె వస్తుంది. గుట్టుగా సంసారం చేస్తే గోపాలం చదువు అయి పోతుంది.

''ఈ బంగారం తనను ఉద్ధరిస్తుందా.. అమ్మే య్యాలి'' అని నిశ్చయించుకున్నాక సుందరమ్మ మనస్సు తేలికపడింది.

ఇంటికి వచ్చాక గోపాలానికి కేసు పోవడం సంగతి చెప్పి మళ్ళీ అపీల్ చేయడానికి బంగారం అమ్మడం సంగతి కూడా చెప్పింది.

గోపాలం వయసులో చిన్నవాడైనా ఆలోచనాపరుడే.

''అమ్మా నీ వంటి మీద బంగారం అమ్మడం ఎందుకే..అయినా కేసు గెలుస్తామో, లేదో. వీటన్నిటి బదులు ఇల్లు అమ్మేసి మరో అద్దె ఇంటికి మారి పోదామే'' అన్నాడు.

''వద్దురా కన్నా. రేపు నీకు పెళ్ళయ్యాక జీవి తాంతం అద్దె ఇంట్లోనే బ్రతకాలిరా తండ్రీ. అదీకాక మీ నాన్న జ్ఞాపకార్థం మిగిలింది ఈ ఇల్లు ఒక్కటే. ఈ ఇంట్లోనే కన్ను మూయాలని నా కోరిక. ఈ గాజులు లేకపోయినా ఫర్వాలేదు. నీ చదువు పూర్తయి, నువ్వో ఉద్యోగస్తుడివయితే చాలు'' అంది కన్నీరు వత్తుకుంటూ.

గోపాలం మరేం మాట్లాడలేకపోయాడు.

సుందరమ్మ గాజులు అమ్మేసింది. కొంత లాయరుకు ఇచ్చి, మిగతాది బ్యాంకిలో వేసింది.

కేసు హైకోర్టుకు వెళ్ళింది. కేసు నడుస్తున్నప్పుడు ఆ పిటిషన్, ఈ పిటిషన్ అంటూ వెంకటేశం వందా, రెండొందలూ అడుగుతూనే వున్నాడు.

కంటి వెంట రక్తపుబొట్లు చిందుతూ వున్నా సుందరమ్మ చలించకుండా కేసుకోసం డబ్బు ఖర్చు పెడుతూనేవుంది.

రోజులు భారంగా నడుస్తున్నాయి. ఒక పూట కడుపునిండా తింటే మరో పూట అర్థాకలితో వుంటు న్నారు తల్లీకొడుకులు.

ఒకరోజు హఠాత్తుగా గోపాలానికి దగ్గుతో జ్వరం విపరీతంగా వచ్చేసింది.

తిరిగినన్నాళ్ళూ గవర్నమెంట్ హాస్పిటల్ చుట్టూ తిరిగారు. ఓపిక నశించాక ప్రైవేటు డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళింది సుందరమ్మ.

డాక్టరు బలరాం గోపాలాన్ని ఎగ్జామిన్ చేసి, టెస్టులు రాశాడు. వంద రూపాయిల టెస్టుల రిజల్ట్సు చూసి తేల్చిన విషయం గోపాలానికి టి.బి. అని.

సుందరమ్మకు మరోసారి పర్వత శిఖరం మీద నుంచి కూలిపోతున్నట్టనిపించింది.

''నిజమేనంటారా డాక్టరుగారూ'' అంది గొంతు పెగుల్చుకుని.

''నిజం కాకపోతే అబద్ధమా..అనుమానం వచ్చే టెస్టులు చేశాను. ఇప్పటికే ఒక ఊపిరితిత్తి పూర్తిగా చెడి పోయింది. ఇంకా అశ్రద్ధ చేస్తే రెండోది కూడా పాడైపోవడానికి సిద్ధంగా వుంది. బలమైన ఆహారం ఇవ్వా లమ్మా...'' అన్నాడు మందులు రాస్తూ.

సుందరమ్మ తేరుకోవడానికి రెండు నిమిషాలు పట్టింది.

"ఎన్నాళ్ళు మందులు వాడాలి డాక్టరుగారూ" అంది గొంతు పెగుల్చుకుని.

పూర్తిగా తగ్గడానికి ఆర్నెల్లు పడుతుంది. ఖరీదైన మందులు వాడాలి. ఎలా లేదన్నా రెండు, మూడు వేలవుతుంది" అన్నాడు.

"పోనీ నన్ను టి.బి. హాస్పిటల్లో చేర్పించవమ్మా. అక్కడయితే ఇంత ఖర్చు వుండదు. ఇప్పుడు అంత డబ్బు ఖర్చుపెట్టే స్థితిలో లేముకదా" అన్నాడు గోపాలం. తనవల్ల తల్లి ఖర్చులు ఇంకా పెరగకూడదన్నదే గోపాలం ఆత్రుత.

డాక్టరు నవ్వాడు. "మైడియర్ బోయ్, టి.బి. హాస్పిటల్ సంగతి తెలుసా...వెంటనే అడ్మిషన్ దొరకాలంటే వెయ్యి రూపాయిలు అడుగుతారు. ఆపైన హాస్పిటల్లో వున్నన్నాళ్ళూ రిక్షా ఖర్చులు, బస్సు ఖర్చులు అన్నీ లెక్కవేస్తే ఇప్పుడు నేను చెప్పినంతా అవుతుంది. లేదూ మామూలుగా ఎడ్మిషన్ దొరకాలంటే నాలుగైదు నెలలవుతుంది. ఈ లోపున నీ జబ్బు ముదిరిపోతుంది. ఆలోచించుకోండి."

"వద్దు డాక్టరుగారూ.. ఆ ఖర్చులు, బాధలు పడలేను. ఉన్న ఒక్క నలుసునీ నా కళ్ళ ముందే వుండనివ్వండి. ఎంతయినా ఫర్వాలేదు" అంది కంగారుగా.

"మీ పరిస్థితి చూస్తున్నానుగా, ఇంకా తక్కువ ఖర్చు అయ్యేలా ప్రయత్నిస్తాను. ట్రీట్‌మెంట్‌కు ఇక్కడికే రండి" అన్నాడు బలరాం.

సుందరమ్మ ప్రిస్క్రిప్షన్ కాగితం తీసుకుని గోపాలాన్ని వెంటపెట్టుకుని ఉబుకుతున్న కన్నీటిని వత్తుకుంటూ వెళ్ళిపోయింది.

* * *

సుందరమ్మ బ్యాంకి బేలెన్స్ కోర్టు కేసుకైతేనేం, ట్రీట్‌మెంట్ కైతేనేం హారతికర్పూరంలా హరించుకుపోసాగింది. సుందరమ్మకు రోజు రోజుకీ మనశ్శాంతి దూరమవుతోంది. తను కడుపు కట్టుకుని అయినా కొడుక్కి బలమైన తిండి పెడుతోంది. గోపాలం జబ్బు నెమ్మదిగా తగ్గు ముఖం పడుతోంది.

కేసు దగ్గర పడుతుంటే లాయర్ వెంకటేశంతో ఒకసారి మాట్లాడాలని బయలుదేరింది సుందరమ్మ. వెంకటేశం లోపల ఎవరితోనో మాట్లాడుతుంటే సుందరమ్మ బయట బెంచి మీద వతికిలబడింది. కూర్చున్న సుందరమ్మ లోపల సంభాషణ వింటూనే దిగ్గున లేచింది. అది రామారావు కంఠం! రామారావు! వాడి కిక్కడేం పని!

"వెంకటేశంగారూ! మీమీదే ఆశలు పెట్టుకున్నాను. పిల్లలుగల వాడిని. క్రిందటిసారి కనికరించినట్టే ఈసారీ..." అంటున్నాడు.

"మరేం కంగారుపడక. ఈసారీ నువ్వే గెలుస్తావు" లాయరు భరోసా సుందరమ్మ నెత్తిన పిడుగులా పడింది.

"ఆ సుందరమ్మ మీద జాలిపడి ఇంకోలా చేస్తారేమోనని నా భయం. మీ ఋణం వుంచుకోను లెండి."

"ఛ! నాకు జాలి ఏమిటోయ్. ఎవరు డబ్బిస్తే వారి పక్షాన వుంటాం. నన్ను మరీ అంత పాతకాలపు ఛాదస్తుడి కింద కట్టెయ్యకు" లాయరు నవ్వు.

సుందరమ్మ మెదడంతా ఒక్క నిమిషం ఖాళీ అయిపోయింది. రెండు నిమిషాల తరువాత తేరుకొంది. లోపల ఇంకా రామారావు ఏదో అంటూంటే వెంకటేశం పకపకా నవ్వుతున్నాడు.

సుందరమ్మ లేచింది. ఇంక తనకేం పని అక్కడ? నెమ్మదిగా బయటకు వచ్చి కనబడిన రిక్షాలో కూర్చుంది. యాంత్రికంగా ఇంట్లో అడుగుపెట్టి మంచంమీద వాలిపోయింది.

అసురసంధ్య వేళ తల్లి ఇంట్లో దీపం పెట్టకుండా మంచం మీద పడుకోవడం చూసి గోపాలం కంగారు పడ్డాడు.

"అమ్మా! ఏమిటమ్మా.. ఒంట్లో బాగోలేదా" అన్నాడు తల్లి పక్కన కూర్చుని నుదుటి మీద చేయి వేసి.

"అబ్బే- ఏం లేదురా. కాస్త తలనొప్పిగా వుంటేను" అంది.

"మాత్ర తీసుకురమ్మంటావా?" అన్నాడు వెళ్ళడాని కుద్యుక్తుడౌతూ.

"వద్దురా. అదే తగ్గిపోతుంది కాసేపట్లో. కాస్త దీపం వెలిగించు" అంది పక్కకు వత్తిగిలి పడుకుంటూ.

తన కంటిలోని కన్నీటి పొర గోపాలానికి చూపించడం ఇష్టలేకపోయింది సుందరమ్మకు.

గోపాలం లేచి స్విచ్ వేశాడు.

ఆలోచిస్తున్న సుందరమ్మకు నెమ్మదిగా తన మార్గం ఏమిటో గోచరించసాగింది.

* * *

సుందరమ్మ రిక్షా దిగింది. ఇళ్ళు అమ్మకం, కొనుగోలు చేయడానికి సాయపడే ఆఫీసులో ప్రవేశించింది.

కొంతసేపయ్యాక మేనేజర్ "ఏమిటమ్మా" అన్నాడు.

"నేను..నేను మా ఇల్లు అమ్మాలనుకుంటున్నానండీ" అంది గొంతు పెగుల్చుకుని. ఆ మాట ఎంత కష్టం మీద అన్నదో మేనేజరుకి తెలీదు.

ఇంటి ప్లాను, మిగతా వివరాలు అన్నీ మేనేజర్ కిచ్చింది.

"ఇంట్లోవాళ్ళు ఖాళీ చేయకపోతే ఎక్కువ ధర పలకదమ్మా!" అన్నాడు.

"పోనీ ఈ పరిస్థితిలో ఎంత పలుకుతుందో చెప్పండి" అంది స్పందించే గుండెను స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ.

"ఇప్పటి ధరలను బట్టి నలభై వేలు రావచ్చు. ప్రయత్నించమంటారా" అన్నాడు మేనేజర్.

"యాభై వేలయినా...." అంది పూడుకుపోయిన గొంతుతో.

మేనేజర్‌కి అప్పటికి అర్థమైంది సుందరమ్మ ఎంత కష్టంమీద తన దుఃఖం ఆపుకుంటోందో.

నలభై ఏళ్ళ విధవరాలిమీద జాలి కలిగింది.

"ప్రయత్నిస్తానమ్మా. మీరు వెళ్ళిరండి. మేం కబురు పెడతాం మళ్ళీ" అన్నాడు.

సుందరమ్మ కొంగుతో కన్నీరు అద్దుకుంటూ కాగితాలు తీసుకుని బయటికి వచ్చేసింది.

* * *

రామారావుకు తెలియకుండానే సుందరమ్మ ఇల్లు అమ్మేసింది. నలభై అయిదుకి సెటిల్ చేశాడు మేనేజర్. ఇల్లు కొనుక్కున్న జగన్నాథం సుందరమ్మ పరిస్థితులన్నీ గ్రహించాడు.

"సుందరమ్మగారూ! కేసు ఎలాగూ కోర్టులో వుంది. రామారావు ఖాళీ చేసేవరకు మేమైనా అందులో



ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యాన ఈ నెల 5వ తేదీన గుంటూరులో జరిగిన అమరజీవి కొండేపూడి శ్రీనివాసరావు 63వ జయంతి సభలో డాక్టర్ పరుచూరి రాజారాం నుంచి 'అమరజీవి కొండేపూడి శ్రీనివాసరావు' సాహితీ సత్కారాన్ని స్వీకరిస్తున్న శ్రీ వాగంటి సోమయాజులు (వా.సో.). మధ్య వున్నది సభాధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ.

# బి.యన్. భాషితాలు

## మనసు — అద్దం

నీ మనసు ఒక అద్దం లాంటిది
నీ అంతరాత్మ ఒక జ్యోతిలాంటిది
ఆ అద్దంలో చూసి నీ తప్పులు దిద్దుకో
ఆ జ్యోతి వెలుగులో నీ మార్గం తెలుసుకో—



## డబ్బు పాపిష్టిది


ఈ డబ్బు మహా పాపిష్టిది
అవసరానికంటే ఎక్కువ కూడపెడితే
అది నిన్ను ముప్పతిప్పలు పెట్టి
మూడు చెరువుల నీళ్ళు త్రాగిస్తుంది—



## దప్పిక తీరదు

ఆకలి అవుతుందని అడ్డంగా తింటే
అనారోగ్యం చేసి ఆస్పత్రి పాలు అవుతావు
దప్పిక అయినపుడు మంచినీళ్ళు త్రాగాలి కానీ
బావిలో దూకితే దప్పిక తీరదు-
పోతుంది ప్రాణం

—వాస్తుశిల్పి బి.యన్. రెడ్డి



వుండలేం. మీరూ ఏదో అద్దె ఇంట్లో దిగాలి కదా. యాభై రూపాయిలు ఇచ్చి ఆ గదిలో మీరే వుండండి'' అన్నాడు.

''జగన్నాథంగారూ. మీ మేలు జన్మలో మరచి పోలేను'' అంది చేతులు జోడిస్తూ.

తమ ఇంట్లోనే తాము పరాయివాళ్ళుగా బ్రతకడం ప్రారంభించాక గాని తల్లీ కొడుకులకు అదెంత కష్టమైన విషయమో అర్థం కాలేదు.

* * *

''అమ్మా.. ఇక మనం ప్రైవేటు డాక్టరు ఫీజులు ఇచ్చుకోలేం. ఒక్కసారి టి.బి.హాస్పిటల్‌కి వెళ్ళి చూద్దామమ్మా. మన పరిస్థితి చెప్దాం. డాక్టరుగారు ఒప్పుకుంటే మన అదృష్టమే'' అన్నాడు గోపాలం.

చితికిపోతున్న ఆర్థిక పరిస్థితి సుందరమ్మను ఔననేలా చేసింది. ఇద్దరూ టి.బి. హాస్పిటల్‌కి వెళ్ళారు.

అసిస్టెంట్ ఫిజిషియన్ గోపాలాన్ని చెకప్ చేశాడు.

''ఏమ్మా. మీ అబ్బాయికి టి.బి. కాదే. బ్రాంకైటిస్ అనే వ్యాధి. మంచి మందులు వాడితే నెల్లాళ్ళలో తగ్గిపోతుంది'' అన్నాడు.

''మా వాడిని బలరాం డాక్టరుకి చూపించాం డాక్టరుగారూ. ఆయన టి.బి.యే నని ఖచ్చితంగా చెప్పారు. పోనీ కాస్త పెద్ద డాక్టరుగారికి చూపిస్తారా. మీ ఋణం వుంచుకోను'' అంది.

అసిస్టెంట్ నవ్వుకున్నాడు. చీఫ్ రౌండ్స్ అయిపోయాక ప్రత్యేకంగా గోపాలాన్ని చూపించాడు.

చీఫ్ ఎగ్జామిన్ చేశాడు.

''ఏం లేదమ్మా, టి.బి. కాదు. అసిస్టెంట్ మందులు రాసిస్తారు. వాడండి. తొందరలోనే తగ్గిపోతుంది'' అన్నాడు.

''డాక్టరు రాం గారు ఖచ్చితంగా చెప్పారండీ. పోనీ ఆయన దగ్గరున్న ఎక్స్‌రే రిపోర్టులు వగైరా తీసుకు రమ్మంటారా'' అంటూ ఇంకా ఏదో అనబోయింది.

చీఫ్ తన అసిస్టెంట్ వైపు చూసి నవ్వుతూ,''డాక్టర్ రాం చెప్పాడట. అతనికిదో బిజినెస్ అయిపోయింది'' అని మెల్లగా అంటూ, ''అఖ్కర్లేదమ్మా, నా మాట నమ్మండి. తప్పకుండా తగిపోతుంది'' అంటూ వెళ్ళిపోయాడు.

అసిస్టెంట్ మందులు రాస్తూ, ''మీకేమైనా వస్తే రాం దగ్గరకి మాత్రం వెళ్ళకండి ఎప్పుడూ'' అంటూ కాగితాన్ని సుందరమ్మకు అందించాడు.

''అంటే...అంటే...డాక్టరు బలరాం కూడా...'' సుందరమ్మ హృదయం తునాతునకలై పోయింది.

గోపాలం తల్లికి ఆసరా ఇచ్చి నెమ్మదిగా ఇంటికి తీసుకొచ్చాడు.

* * *

సుందరమ్మ మందులు కొని గోపాలంచేత వాడించింది. నెల తిరగ్గానే గోపాలం జబ్బు పూర్తిగా నయమైపోయింది.

నల్లకోటు పొడిచిన వెన్నుపోటు తట్టుకోవడానికే సుందరమ్మకు చాలా స్థైర్యం, నిగ్రహం కావలసి వచ్చాయి. ఇప్పుడు తెల్లకోటు పొడిచిన పోటుకు తట్టుకోలేకపోయింది. మానసికంగా బలహీనురాలై మంచం పట్టింది. ప్రపంచమంతా తమపై పగ పట్టినట్టు ఊహించుకోవడంతో గుండెపోటు రావడం ప్రారంభించింది.

కాని తనకు గుండెపోటు వస్తున్నట్టు సుందరమ్మ కొడుక్కి చెప్పలేదు. తల్లి మానసికంగా బాధపడుతోందని గోపాలం తల్లిని ఎంతగానో ఓదార్చాడు.

''అమ్మా ఎందుకమ్మా బాధపడతావు. ఇల్లు అమ్మేశాం. వడ్డీతో ఎలాగో సరిపెట్టుకుంటూ చదువు పూర్తి చేస్తానమ్మా. నా జబ్బు కూడా పూర్తిగా తగ్గిపోయిందిగా. ఇక నిశ్చింతగా వుండమ్మా'' అన్నాడు.

సుందరమ్మ కన్నీరే సమాధానమైంది.

* * *

తెల్లవారుఝామున 5 గంటలకు సుందరమ్మకు విపరీతంగా గుండెపోటు వచ్చింది. గోపాలాన్ని లేపకుండానే బాధ భరించడానికి ప్రయత్నిస్తోంది.

పాలవాడు తట్టిన తలుపు శబ్దానికి గోపాలం లేచాడు. తల్లి పరిస్థితి చూసి కంగారుపడ్డాడు. సుందరమ్మ ముఖంలో అప్పుడే చావుకళ ప్రవేశిస్తోంది.

గోపాలం వెళ్ళి తలుపు తీసి తల్లి మంచం దగ్గరకు పరుగెత్తుకుని వచ్చాడు.

''అమ్మా! డాక్టరుగారిని పిలవడానికి వెళ్ళేదా'' అన్నాడు ఆతృతగా.

పాలు పోసే రాములు లోపలికి వచ్చి సుందరమ్మ పరిస్థితి చూశాడు.

గోపాలం బాబూ మరేం కంగారు పడమాక. నాను, నువ్వు సాయం పట్టి ఆసుపత్రికి తీసికెళదాం. ఈ టయింలో ఏ డాట్టరు మనింటికొస్తాడు. రిచ్చా పిలుసుకొత్తాను'' అంటూ వెళ్ళబోయాడు.

సుందరమ్మ చేత్తో రాముల్ని వెళ్ళవద్దని సైగ చేస్తూ



సెప్టెంబర్ 5న విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యాన బుక్ సెంటర్‌లో శ్రీ గణపతిరాజు అచ్యుతరామరాజు అధ్యక్షతన జరిగిన సభలో సుప్రసిద్ధ నవలా రచయిత శ్రీ రాచకొండ విశ్వనాథ శాస్త్రి 'బలివాడ కాంతారావు కథలు' ఆవిష్కరించారు. రచయితతోపాటు ఈ పుస్తకం రావడానికి కృషిచేసిన శ్రీ ఆకుల చెల్లారం, శ్రీ ముత్యాలరావు, శ్రీ కాళీపట్నం రామారావు ఫోటోలో వున్నారు.

దగ్గరకు పిలిచింది.

''ఏటమ్మా. సెప్పు'' అంటూ మంచం దగ్గర కొచ్చాడు రాములు.

''నీ కొడుకుతోపాటు మా..గోపాలాన్ని..పెంచుకుంటావురా రాములూ'' అంది అతి కష్టం మీద మాట్లాడుతూ.

''అదేటమ్మా. నీకేటవదు. పద ఆసుపత్రి కెళదాం'' అన్నాడు రాములు.

''వద్దురా. నా ప్రైము అయిపోయింది. ఇంక బ్రతకను. అందరూ నన్ను మోసం చేశార్రా..గోపాలం పేర్న..నలభై వేలున్నాయి. నీకేం భారంకాదు. వాడి చదువు పూర్తయి ఏదో చిన్న ఉద్యోగంలో చేరేవరకూ.. తల్లీ..తండ్రీ...అంతా నువ్వేరా'' అంది తడబడుతున్న మాటతో. సుందరమ్మ మాటలో స్పష్టత నెమ్మదిగా తగ్గిపోసాగింది.

''అదేటమ్మా. గోపాలంబాబు మా నాటోళింట్లో ఎలా వుంటాడు'' అన్నాడు.

''మీలాటోళే వాడిని..పెంచాలిరా...పెద్ద పెద్దోళ్ళంతా దగా చేశార్రా..నువ్వు నాకు మాటిస్తే..తృప్తిగా వెళ్ళి..పోతాను'' అంటూ సుందరమ్మ చెయ్యి సాచింది.

తన మీద వుంచిన నమ్మకానికి రాముడి కళ్ళు చెమ్మగిల్లాయి. అప్రయత్నంగా చేతిలో చెయ్యి వేశాడు.

''అమ్మా..నన్ను వదిలేసి వెళ్ళిపోతావా'' గోపాలం తల్లి చెయ్యి పట్టుకుని బావురుమన్నాడు.

సుందరమ్మ గోపాలంవైపు చూసింది. కొడుకుని ఆ స్థితిలో వదిలి వెళ్ళిపోతున్నందుకు బాధ ద్విగుణీకృతమైంది.

కొడుకు చెయ్యి తీసుకుని రాములు చేతిలో వుంచింది.

అంతవరకూ రెపరెపలాడుతున్న ప్రాణజ్యోతి ఆరిపోయింది.

●

